ఓం నమో భగవతే శ్రీ రమణాయ



# రమణ భాస్కర



వ్యవస్థాపక సంపాదకులు : బి. వి. ఎల్. ఎన్. రాజు

సంపుటి : 28 | సంచిక : 7 | మార్చి 2023

రమణ భాస్కర
ఆధ్యాత్మిక మాస పత్రిక

పేజీలు : 24

గౌరవ సంపాదకులు
శ్రీమతి P. H. V. సత్యవతి (హైమ)

చందా
సంవత్సర చందా:రు॥ 150/-
విడి ప్రతి : రు॥ 15/-

చిరునామా
రమణ భాస్కర
శ్రీ రమణ క్షేత్రం,
జిన్నూరు – 534 265
ప॥గో॥ జిల్లా, ఆం॥ప్ర॥

పబ్లిషర్
సద్గురు శ్రీ నాన్నగారు
శ్రీ రమణ క్షేత్రం
జిన్నూరు – 534 265
9441122622
7780639977

ప్రింటర్
శ్రీ భవాని ఆఫ్‌సెట్ ప్రింటర్స్
(దుడే శ్రీను) ఎస్. వి. ఆర్. కాంప్లెక్స్,
పాలకొల్లు, 9848716747

డిజైనింగ్
అనన్య జిరాక్స్ & నెట్ సెంటర్
(నందిగామ శేషసాయి)
పి. పి. రోడ్డు, లజపతిరాయ్ పేట,
పాలకొల్లు, 9397151342

## ఈ సంచికలో. . . .

సద్గురు శ్రీనాన్నగారి అనుగ్రహభాషణములు ................ 2


శ్రీమద్భగవద్గీత ........................................................ 21

మార్గం ఏదైనా మిథ్యా నేను నశించాలి ...................... 24

**ఇతర విషయములు :**

చావలి సూర్యనారాయణమూర్తి గారి వ్యాసం

సాగిరాజు రామకృష్ణంరాజు గారి వ్యాసం



ఏదైతే స్మరిస్తున్నామో, ఏదైతే తలపెట్టుకుంటున్నామో అదే మనం అవుతాము. ఒక్క జ్ఞానిని స్మరిస్తే మీకెంతో శాంతి కలుగుతుంది, ఆనందం కలుగుతుంది, కెరటాలు లేని సముద్రం ఎంత ప్రశాంతంగా ఉంటుందో అంత ప్రశాంతత మనకు కలుగుతుంది.

ఓం శ్రీనాన్న పరమాత్మనే నమః

# సద్గురు శ్రీనాన్నగారి అనుగ్రహభాషణములు - 31 మే 1988, వడ్లవానిపాలెం

## సాక్షాదరుణగిరీశ్వర వరార్హమగు అక్షరమణమాల నమరించుటకును
## కరుణాకరుండగు గణపతి యొసగి కరమభయకరము కాపాడుగాక

రమణస్వామి ప్రార్థిస్తున్నాడు. ఎవరిని? విఘ్నేశ్వరస్వామిని ప్రార్థిస్తున్నాడు. ఏమని ప్రార్థిస్తున్నాడు అంటే, సాక్షాదరుణగిరీశ్వర వరార్హమగు మాములు పెళ్లి కొడుకు అయితే ఏదో బజారులోకి వెళ్లి పది రూపాయలో, ఇరవై రూపాయలో దండ కొనుక్కునితెచ్చి పెళ్లి కొడుక్కి వేయచ్చు. ఇక్కడ రమణస్వామి ఏమంటున్నాడు అంటే, మాములు పెళ్లి కొడుక్కి తయారు చెయ్యట్లేదు నేను దండ. ఎటువంటి పెళ్లి కుమారుడు? సాక్షాత్తు అరుణాచల శివుడు. శివుడు అనే పెండ్లి కుమారుడికి దండ తయారు చెయ్యటానికి నేను పూనుకున్నాను అంటున్నాడు.

అరుణాచలేశ్వరుడు అందరి హృదయాలలోను అంతర్యామిగా ఉన్నాడు. అందరి హృదయాలలోనూ భగవంతుడు ఉన్నాడు. అందరిని సమానంగా చూడాలి. సమానమైన బుద్ధి ఉంటే అది కూడా యోగమే. శరీరాలు తేడా, మనస్సులు తేడా కానీ ఈ మనస్సు అనే తొడుగు తీసేస్తే, శరీరం అనే తొడుగు తీసేస్తే, లోపల ఉన్న వస్తువు ఒక్కటే, పరమేశ్వరుడు ఒక్కడే అని అన్ని శాస్త్రాలు చెబుతున్నాయి. అయితే ఏవండీ, భగవంతుడు అందరి హృదయాలలోనూ ఉన్నాడు అని అంటున్నారు. మేము కళ్ళు మూసుకుంటే చీకటి కనిపిస్తోంది కాని మాకు హృదయంలో ఉన్న దేవుడు కనిపించటం లేదు, అని మీరు అందరూ అనుకోవచ్చు. పైకి ఊరికే గొప్ప మాటలు చెప్పినప్పటికీ, మనం కళ్ళు మూసుకుంటే చీకటి కనిపిస్తుంది కాని దేవుడు కనిపించటం లేదు. హృదయంలోనే నేను ఉన్నాను అని కృష్ణుడు కూడా గీతలో చెప్పాడు. కాని హృదయంలో ఉన్న కృష్ణుడు, హృదయంలో ఉన్న ఆత్మ, హృదయంలో ఉన్న చైతన్యం, ఎవరికి అయినా సరే ఇక్కడ అనుభవంలో ఉందా? ఎవరికీ అనుభవంలో లేదు. ఆ పరమాత్మ ఎవరికి అయితే అనుభవంలోకి వచ్చాడో, వాడు జ్ఞాని అవుతాడు. వాడే ఈ జనన మరణ సంసార చక్రం నుండి బయట పడతాడు.

మీరు బీదలు అయినప్పటికీ, ధనవంతులు అయినప్పటికీ, చదువుకున్న వారు

అయినప్పటికీ, చదువు లేని వారు అయినప్పటికీ, మీ హృదయంలో ఉన్నటువంటి ఆత్మ అనుభవంలోకి వచ్చే వరకు మీకు సంసారం తప్పదు, ఈ దుఃఖం తప్పదు, బాధ తప్పదు, కష్టం తప్పదు, నష్టం తప్పదు, ఏదీ తప్పదు హృదయంలో ఉన్న పరమేశ్వరుడు మనకి అనుభవంలోకి వచ్చే వరకు ఆ పరమేశ్వరుడు ఇక్కడే ఉన్నాడు. ఇప్పడే ఉన్నాడు, ఒకప్పడు ఉండి ఇప్పడు లేకపోవటం అంటూ లేదు. మన హృదయంలో సిద్ధంగా ఉన్నాడు. మనం నిద్ర పోతున్నప్పడు కూడా ఆయన మెలకువగానే ఉన్నాడు. అయితే ఏమిటి ఆయన మనకి అనుభవంలో లేడు. వస్తువు మన హృదయంలోనే ఉంది కాని మనకి అనుభవంలో లేదు. మీ పెట్టెలో వంద రూపాయలు ఉన్నాయి అనుకోండి కాని ఆ పెట్టెలో వంద రూపాయలు ఉన్నట్టు మీకు తెలియకపోతే ఉన్నా సుఖం లేదు. ఎందుచేత? అది మీరు వాడుకోవటానికి ఏమి ఉపయోగపడదు. అదే విధంగా హృదయంలో ఆత్మ ఉన్నప్పటికీ, అది మీ అనుభవంలోకి రాకపోతే అది మీకు తెలియకపోతే దానిలో ఉండే శాంతి కాని, సుఖం కాని మీకు అనుభవంలోకి రాదు. పరమేశ్వరుడు అనుభవంలో లేడు, ఆత్మ అనుభవంలో లేదు, శాంతి అనుభవంలో లేదు, కాని మనకి అనుభవంలో ఉన్నది మన దేహం అనుభవంలో ఉంది, మన అహంకారం అనుభవంలో ఉంది, మన మనస్సు అనుభవంలో ఉంది. దీనికి మీరు దేవుడు ఉన్నాడు అని, దేవుడు లేడు అనే ప్రశ్నల జోలికి వెళ్ళకండి. నా శరీరం నాకు అనుభవంలో ఉంది కాబట్టే ఈ శరీరానికి ఏదైనా బాధ వస్తే నాకు తెలుస్తోంది. దీనికి ఏదైనా కష్టం వస్తే తెలుస్తోంది. దీనికి రోగం వస్తే మందులు వేసుకుంటున్నాను. ఈ శరీరం గురించి ఎన్నో బాధలు పడుతున్నాను. నాకు సుఖం కంటే ఎక్కువ దుఃఖమే వస్తుంది ఈ శరీరం లోంచి, ఈ శరీరం అందరికి అనుభవంలో ఉంది.

ఏ మనిషి అయినా సరే వాడు హిందువు అవ్వనివ్వండి, క్రైస్తవుడు అవ్వనివ్వండి, ఏ మతస్తులు అయినప్పటికీ ఏవండీ మేము చాలా బాధ పడుతున్నాం అని ఎవరైనా మీతో చెబితే, రెండు రకాల బాధలు ఈ సృష్టిలో ఉన్నాయి. ఈ రెండు రకాల బాధలు తప్పించి మూడో రకం బాధ ఈ సృష్టిలో ఎక్కడా లేదు. ఒకటి శారీరకం అయిన బాధ, రెండు మానసికమైన బాధ. శరీరానికి సంబంధించిన రోగం వస్తే బాధ పడతాము, ఇది ముసలిది అయిపోతే బాధ పడతాము, దీనికి మరణం వస్తే బాధ పడతాము, శరీరానికి ఏమి వచ్చినా బాధ పడతాము. ఎందుచేత? శరీరం నాకు అనుభవంలో ఉంది. ఇంకోటి మనసు అనుభవంలో ఉంది. దానికి దుఃఖం వస్తూ ఉంటుంది, సంతోషం వస్తూ ఉంటుంది, ఒకళ్ళ

మీద కోపం వస్తుంది, ఒకళ్ళ మీద ఈర్ష్య వస్తూ ఉంటుంది. ఉన్నది ఒక్కటే వస్తువు, ఉన్నది ఒక్కటే ఆత్మ అయినప్పుడు కామం ఎందుకు వస్తుంది? కోపం ఎందుకు వస్తుంది? ఈర్ష్య ఎందుకు వస్తుంది? అసూయ ఎందుకు వస్తుంది? ఇవి ఎవరి మీద వస్తున్నాయి. నాకు అసూయ మీ మీద వచ్చింది అనుకోండి, మిమ్మల్ని ఒక శరీరంగానో, మనసుగానో చూస్తున్నాను ఇవి వస్తున్నాయి. మీలో ఆత్మ ఉంది అని గ్రహించే శక్తి నాకు ఉంటే, ఆత్మానుభవం కనుక నాకు ఉంటే, మీ మీద నాకు అసూయ రాదు, మీ మీద నాకు కోపం రాదు, మీ మీద నాకు ద్వేషం పుట్టదు. నాకు కోపం ఉంది, ఈ కోపాన్ని ఎవరి మీద గురి పెడుతున్నాం? జీవుడు ఇంకొక జీవుడు మీద గురి పెడుతున్నాడు. ఏ కోపాన్ని అయితే ఎదుటి మనిషి మీద గురి పెడుతున్నాడో, అది మళ్ళీ ఇతనికే తిరిగి వచ్చేస్తుంది. ఇతను ద్వేషిస్తే తిరిగి ఇతనికి ద్వేషం వస్తుంది. ఇతను కోపిస్తే తిరిగి ఇతనికి కోపం వస్తుంది. ఏదైతే మనం లోకానికి ఇచ్చామో, అదే మళ్ళీ మనకి తిరిగి వస్తుంది.

ఇంగ్లీషులో ఒక సామెత ఉంది, మీలో మంచి ఉండవచ్చు, మీలో చెడ్డ ఉండవచ్చు. కాని లోకానికి ఇచ్చేటప్పుడు మంచినే ఇవ్వండి. మీకు తెలివితేటలు ఉంటే లోకానికి మీ తెలివి ఇవ్వండి. మీకు ఏదైనా మంచితనం ఉంటే లోకానికి మీ మంచితనం ఇవ్వండి, మీరు ఇచ్చిన మంచే మళ్ళీ పరమేశ్వరుడు మీకు తిరిగి ఇచ్చేస్తాడు. సర్వ సాధారణంగా మనకు ఉన్న అలవాటు ఏమిటి అంటే, మంచిని మనం ఉంచుకుంటాం, చెడ్డని ఎదుటి వాళ్ళకి పంచిపెడతాము, ఇది మనకి అలవాటు అందుచేత ఆ చెడ్డే మళ్ళీ మనకి తిరిగి వస్తుంది. లోకానికి ఏదైతే మనం ఇచ్చామో అదే మళ్ళీ మనకి తిరిగి వస్తుంది. ఇంతకి బాధ రెండు రకాలు. నా మనసు ఈ మధ్యన కుదురుగా ఉండటం లేదు అంటారు. మీరు పైకి చెప్పకండి, ఇది మీ అనుభవంలో ఉన్నదే. ఏ మనిషి బాధ పడినప్పటికీ, ఏ మనిషి దుఃఖ పడినప్పటికీ, ఏ మనిషి కష్ట పడినప్పటికీ, ఇవి రెండే కారణం. ఒకటి శరీరం, రెండు మనసు. ఈ రెండింటి చుట్టూ మనం తిరుగుతున్నాం. ఆత్మలో సుఖం ఉంది అంటున్నారు, శాంతి ఉంది అంటున్నారు, ఆనందం ఉంది అంటున్నారు, ఆత్మ మనకు అనుభవంలో లేదు కాబట్టి, దానికి సంబంధించిన శాంతి కాని, దానికి సంబంధించిన సుఖం కాని, మనకు ఏమి దొరకటం లేదు. ఏది మనకు అనుభవంలో ఉంది? మన పొగరుబోతుతనం మనకి అనుభవంలో ఉంది. మన అహంకారం మనకి అనుభవంలో ఉంది, మన ఇష్టాయిష్టాలు మనకి అనుభవంలో ఉన్నాయి. మన శరీరం మనకి అనుభవంలో ఉంది.

మనస్సు అనుభవంలో ఉంది. ఈ శరీరం గురించి మనం బెంగ పెట్టుకుంటాం. మనస్సుకి ఏదైనా కష్టం వస్తే బాధ పడతాం. హృదయంలో ప్రకాశిస్తున్న పరమేశ్వరుడిని మనం తెలుసుకునే వరకు, ఈ రెండింటి యొక్క బాధలు ఎన్ని జన్మలు ఎత్తినా, ఎన్ని లోకాలకి వెళ్ళినా, కోటి సంవత్సరాలు బ్రతికినా మీకు తప్పదు, నాకు తప్పదు. అందుచేత ఈ రెండింటిని అతిక్రమించాలి అంటే. ఈ రెండింటిని దాటి వెళ్ళాలి అంటే, ఈ ప్రకృతి లోంచి బయట పడాలి అంటే, ఈ సంసార చక్రం నుండి బయట పడాలి అంటే, నువ్వు దుఃఖం లోంచి, వేదన లోంచి, ఆవేదన లోంచి, అశాంతి లోంచి నువ్వు విడుదల పొందాలి అంటే, ఆత్మ రూపంలో ఉన్న అరుణాచలేశ్వరుడిని ఎలా తెలుసుకోవాలో, ఈ అక్షరమణమాలలో రమణస్వామి చెప్పాడు. అది అక్షరమణమాల.

ఈ దేహాన్ని అభిమానిస్తున్న జీవుడిని, మనస్సుని అభిమానిస్తున్న జీవుడిని, అహంకారాన్ని అభిమానిస్తున్న జీవుడిని, దేహం మాత్రమే నేను అనుకునే జీవుడిని, ఆత్మ వైపు తిప్పటం కోసం, మనస్సుని అంతర్ముఖం చేయటం కోసం, ఆత్మానుభవం కలిగించటం కోసం, నేను ఒక దండని తయారు చేస్తున్నాను. ఓ గణపతిస్వామి! విఘ్నాలు రాకుండా చూసేస్వామివి నువ్వు, అటువంటి దండ తయారు చేసేటప్పుడు మొట్ట మొదటగా నిన్ను ప్రార్థిస్తున్నాను. నువ్వు అభయం ఇచ్చి నాకు ఈ పని పూర్తి అయ్యేలాగా నన్ను ఆశీర్వదించు గణపతి అని గణపతిస్వామి ప్రార్థన చేసి తన దండని ప్రారంభించాడు రమణస్వామి. ఈ అక్షరమణమాల మీరు జాగ్రత్తగా చదివితే, ఈ దేహాభిమానం లోంచి విడుదల పొందుతాం. ఈ దేహం మాత్రమే నేను అనే భావన లోంచి, ఈ అహంకారం మాత్రమే నేను అనే భావన లోంచి విడుదల పొందుతాం. జ్ఞానికి, అజ్ఞానికి తేడా ఏమిటి అంటే, దేహం మాత్రమే నేను అని అజ్ఞాని అనుకుంటాడు. ఆత్మ నేను అని జ్ఞాని అనుకుంటాడు. పైకి మనుషులు ఇద్దరు సమానంగానే కనిపిస్తారు. అయితే జ్ఞానికి వైరాగ్యం ఉంటుంది, అజ్ఞానికి రాగం ఉంటుంది. జ్ఞాని నేను మరణిస్తున్నాను అని అనుకోడు ఎందుచేత అనుకోడు? తన హృదయంలో



**లోకంలో అనేక విద్యలు ఉన్నాయి, కానీ బ్రహ్మవిద్యని నేను, ఆత్మ విద్యని నేను అని భగవంతుడు వాసుదేవస్వామి విభూతియోగంలో చెప్పాడు.**

ఉన్నటువంటి ఆత్మకి మరణం లేదు. అజ్ఞాని నేను మరణిస్తున్నాను అని అనుకుంటాడు. దేహం మాత్రమే తాను అనుకుంటాడు కాబట్టి, నేను ఫలానా ఎల్లమ్మని, నేను ఫలానా పుల్లమ్మని, నేను ఫలానా రాజుల అమ్మాయిని, లేకపోతే నేను బ్రాహ్మణుల అమ్మాయిని, నేను ఫలానా సంవత్సరంలో పుట్టాను, ఇంత వయసు వచ్చింది నాకు, ఇంకో నాలుగు సంవత్సరాలలో మరణిస్తాను. అని ఎప్పడూ ఇటువంటి దేహానికి సంబంధించిన భావాలు ఉంటాయి కాబట్టి, అది అజ్ఞాని లక్షణం. లోపల ఆత్మ వస్తువు ఉంది, దానికి మరణం లేదు. ఆత్మని తెలుసుకున్న వాడు ఆత్మ అవుతాడు కాబట్టి, ఆత్మకి మరణం లేదు కాబట్టి, వాడికి కూడా మరణం లేదు. వాడు అమృతుడు అవుతాడు. వాడికి మృత్యుభయం ఉండదు. అందుచేత జ్ఞాని ఆ స్థితిని పొందుతాడు.

ఇక్కడ మన అందరికి ఏదో రకమైన బాధ ఉంది. బాధ లేని మనిషి, అశాంతి లేని మనిషి, దుఃఖం లేని మనిషి, సృష్టిలో ఎవరు లేరు. పైకి చెప్పకపోయినా మనం ఎప్పడు శాంతిగా ఉండాలి, మనం ఎప్పడు సుఖంగా ఉండాలి, మనం ఎప్పడు ఆనందంగా ఉండాలి, మనకి చావు రాకూడదు, మనకి ఎప్పడు బాధ ఉండకూడదు, మన సంసారం బాగుండాలి, అని ఇక్కడ అందరూ కోరుకుంటారు. ఈ కోరిక లేని వారు ఇక్కడ ఎవరైనా ఉన్నారా? అన్ని పార్టీల వారు సుఖాన్ని కోరుకుంటారు. అన్ని కులాల వారు సుఖాన్ని కోరుకుంటారు. అన్ని మతాల వారు సుఖాన్ని కోరుకుంటారు. సుఖాన్ని, శాంతిని అందరూ కావాలి అని కోరుకుంటున్నారు కాని అది ఎక్కడ ఉందో, అది ఎలా వస్తుందో ఎవ్వరికీ తెలియదు. లోపాలు ఎక్కువ ఉన్న మనిషి, పాపాలు ఎక్కువ ఉన్న మనిషి, బలహీనతలు ఎక్కువ ఉన్న మనిషి, ఆధ్యాత్మిక చింతనలోకి రానే రాడు. ఆత్మచింతన వాడికి కలగదు. మోక్షం అనే ఒక స్థితి ఉంది, అది గొప్ప స్థితి, ఉన్నతమైన స్థితి, ఉదాత్తమైన స్థితి. ఆ మోక్షం అందరి హృదయాలలోను ఉంది. అది ఎక్కడో బయట లేదు. మోక్షాన్ని ఎవరైతే పొందారో, వాళ్లకి ఇంక దుఃఖం అనేది ఉండదు. వాళ్లకి సఫరింగ్ అనేది ఉండదు. మోక్షాన్ని పొందటం కోసం సత్‌గ్రంథాలు పఠించమన్నారు, మహాపురుషులతోటి స్నేహాలు చెయ్యమన్నారు, మహాపురుషులు చెప్పిన మాటలు వినమన్నారు. మీరు పరమ పవిత్రులు అయితే ఒక్కసారి భగవద్గీత వింటే, ఒక్కసారి ఉపనిషత్తులు కనుక వింటే, మీరు ఈ ధ్యానాలు చెయ్యక్కర్లేకుండా, పూజలు చెయ్యక్కర్లేకుండా, జపాలు చెయ్యక్కర్లేకుండా మీకు మోక్షం వస్తుంది, మీలో అర్హత కనుక ఉంటే!

గీతలో కృష్ణుడు చెప్పిన మాటలు కాని, అక్షరమణమాలలో రమణస్వామి చెప్పిన మాటలు కాని, మనకి నచ్చటం లేదు అంటే మన హృదయంలో పాపం ఉన్నట్టు గుర్తు. భగవంతుడు చెప్పిన మాటలు అబద్ధాలు కాదు. అందులో ప్రతీ అక్షరం నిజం. వాటిని మనం హేళనగా చూస్తున్నాం అంటే, అది మన బుర్రకి అందటం లేదు అంటే, దానికి మన హృదయంలో ఉన్న దోషమే కారణం. మన హృదయంలో దోషాలు ఉన్నంతకాలం, మన హృదయంలో బలహీనతలు ఉన్నంతకాలం, ఆ మాటలు ఎంత మంచివి అయినప్పటికీ మనకి రోతగా కనిపిస్తాయి. ఎంతకాలం అయితే మీలో అజ్ఞానం ఉందో, అంతకాలం శారీరక బాధలు, మానసిక బాధలు, చిత్త వృత్తికి సంబంధించిన బాధలు, ఎన్ని జన్మలు ఎత్తినా, ఏ లోకానికి వెళ్ళినా, మిమ్మల్ని వెంటాడుతూనే ఉంటాయి. ఎప్పటి వరకు? మీకు ఆత్మానుభవం జరిగే వరకు. అందుచేత మీరు ఆత్మానుభవం పొందటం కోసం, ఈ అక్షరమణమాలని నేను తయారు చేస్తున్నాను అంటున్నాడు రమణస్వామి. నా సంసారంలో దుఃఖం లేదు. నేను సుఖంగా ఉన్నాను, నాకు ఇవాళ అశాంతి లేదు అని మీరు తాత్కాలికంగా అనుకోవచ్చు. డాక్టర్లు చేసే సహాయం, మీ తల్లితండ్రులు మీకు చేసే సహాయం, పెద్దలు చేసే సహాయం, ఇవన్నీ తాత్కాలికం అయినవే. వీటిలో నిజమైన పరిష్కారం మీకు లేదు, తాత్కాలికం అయిన ఉప శాంతే. మీకు ఏమైనా దుఃఖంగా ఉంటే సినిమాకు వెళితే ఆ గంట సేపు మీకు శాంతిగా ఉంటుంది. మళ్ళీ ఇంటికి వచ్చాక మరుసటి రోజు నుండి మీ బాధ మీదే. అందుచేత మీరు సినిమాలకి వెళ్ళినా, పెద్దల దగ్గరకు వెళ్ళినా, డాక్టర్ల దగ్గరకు వెళ్ళినా, ఇవన్నీ తాత్కాలికం అయినవే కాని శాశ్వతశాంతి కావాలి అంటే, ఈ ప్రకృతి నుండి బయటపడాలి అంటే, శాశ్వతమైన సుఖం మీకు కావాలి అంటే మీరు మోక్షం పొంది తీరాల్సిందే. అంతకంటే ఇంకొక గమ్యం లేనే లేదు. మోక్షం సాధించటం కోసం, దానిని పొందింప చేయటం కోసం, అనుగ్రహమూర్తి అయినటువంటి భగవాన్ శ్రీ రమణమహర్షి దండను తయారు చేయటానికి సిద్ధ పడుతున్నాడు.

ఓ గణపతిస్వామి! అరుణాచలేశ్వరుడు ఎంత గొప్పవాడు, అంత గొప్ప వాడికి ఎంత గొప్ప దండ తయారు చెయ్యాలి? ఆయన మాములు పెళ్లికొడుకా? పది రూపాయల దండ కొని తెచ్చి వేసేయడానికి అంత గొప్ప దండ తయారు చెయ్యటానికి, తగినటువంటి అర్హత, తగినటువంటి యోగ్యత, తగినటువంటి విలువ, తగినటువంటి బుద్ధి, తగినటువంటి ఏకాగ్రత, తగినటువంటి తెలివి నాకు ప్రసాదించు గణపతి అని గణపతిస్వామి ప్రార్ధన చేసి

తన దండని ప్రారంభించాడు రమణస్వామి. మనం ఏ పని మొదలు పెట్టినా భగవంతుడి దయ ఉండాలి. భగవంతుడి దయ లేకపోతే ఆ పని సక్రమంగా జరగదు. ఏదైనా ఒక పని మనం మొదలు పెడితే, ఆ పని బాగా పూర్తి అయింది అంటే, దానికి ఈశ్వరుడి యొక్క అనుగ్రహం ఉంది అని గుర్తు. ఈశ్వర అనుగ్రహం లేకపోతే మనం పని మొదలు పెట్టినప్పటికీ అది సరిగ్గా పూర్తి అవ్వదు. అది అసంపూర్తిగానే ఉంటుంది. ఎవరికి అయినా నాలుగు రూపాయలు ఉన్నాయి అనుకోండి, వాడి పని చాలా బాగుంది అంటారు. వాడి పని చాలా బాగుంది అంటే ఆర్థికంగా బాగుంది అనా? వాడు మానసికంగా బాగున్నాడు అనా? వాడి పని ఎంత వరకు బాగుంది? అన్నానికి లోటు లేదు, బట్టకు లోటు లేదు. అంతమాత్రం చేత సరిపోయిందా? అంతమాత్రం చేత సరిపోలేదు.

ఈ మధ్య బెంగళూరులో కారులో ప్రయాణం చేస్తుంటే ఒక జర్మనీ దేశస్థుడు కూర్చుని మాట్లాడుతున్నాడు. మాటల సందర్భంలో నేను ఆయనతో యేసుక్రీస్తు ఏమన్నాడు అంటే కేవలం అన్నం వల్లే మనిషి బ్రతకడం లేదు అన్నాడు అని చెప్పాను. మనుషులు అందరూ బ్రతుకుతున్నారు. అన్నం వల్లే బ్రతకడం లేదు అని యేసుక్రీస్తు అన్నాడు. అప్పుడు ఆ జర్మనీ దేశస్థుడు ఏమన్నాడు అంటే కేవలం అన్నం తినటం వల్లే మనిషి బ్రతకడం లేదు. అంత వరకు బాగానే ఉంది, కాని అన్నం లేకపోయినా బ్రతకలేడు. యేసుక్రీస్తు అలా ఎందుకు చెప్పాడు అంటే అన్నం అవసరమే, అన్నం తినటమే మనిషి యొక్క లక్ష్యం కాదు అని, మీ హృదయంలో ఉన్నటువంటి స్వర్గరాజ్యాన్ని అనుభవంలోకి తెచ్చుకోవడమే మీ లక్ష్యం. అందుచేత మీరు అన్నం తినవచ్చు, బట్ట కట్టుకోవచ్చు, ఇల్లు కట్టుకోవచ్చు. ఇవి లక్ష్యం కాదు ఇవి శరీరానికి అవసరమే అయితే మీ గమ్యం ఇది కాదు. గమ్యం మటుకు మోక్షమే. యేసుక్రీస్తు ఏ ఉద్దేశంతో అయితే చెప్పాడో దానిని మనం పట్టుకోవాలి. అందుచేత జీవితగమ్యం మోక్షం, జీవితగమ్యం జ్ఞానం.

సోదరమహాశయులారా! మీరు పొందినా, పొందకపోయినా, మీరు అందుకున్నా, అందుకోకపోయినా, మీరు సాధించినా, మీరు సాధించకపోయినా, జ్ఞానాన్ని మీరు అందరూ గమ్యంగా పెట్టుకోండి. మీరు గమ్యాన్ని చేరుకోవచ్చు, చేరుకోకపోవచ్చు. కాని మీరు గమ్యంగా పెట్టుకోవాల్సింది ఒక్క జ్ఞానాన్నే. జ్ఞానం వల్లే మోక్షం వస్తుంది. జ్ఞానం లేకపోతే ఏ మనిషికి మోక్షం రాదు. ఆత్మజ్ఞానం లేకపోతే మీరు ఎవరి భక్తులు అయినప్పటికీ మీకు మోక్షం రానే రాదు. అటువంటి ఆత్మజ్ఞానాన్ని, మనం లక్ష్యంగా పెట్టుకోవాలి. దానిని చేరుకున్నామా?

దానిని చేరుకోలేదా? దానిని పొందామా? దానిని పొందలేదా? అనేది వేరే విషయం. దానిని పొందొచ్చు, దానిని పొందలేక పోవచ్చు. అయితే లక్ష్యాన్ని మటుకు మనం ఆత్మజ్ఞానాన్నే పెట్టుకోవాలి. లక్ష్యం విషయంలో మనకు దోషం ఉండకూడదు. అందుచేత జ్ఞానాన్ని గమ్యంగా పెట్టుకుని, జ్ఞానాన్ని లక్ష్యంగా పెట్టుకుని, మనం జీవించాలి. అది చాలా ముఖ్యం. జ్ఞానం మనకి కావాలి అంటే ఈ అక్షరమణమాలని అనుదినం పారాయణ చేయటం వల్ల, ఒక్క జ్ఞానమే కాదు అన్నం కూడా పెడుతుంది.

నేను మీ ఇంటికి చూడటానికి వచ్చాను అనుకోండి, నేను రావటం మిమ్మల్ని చూడటానికి వచ్చాను. కాని మీరు నాకు కాఫీ కూడా ఇస్తారు. అదే విధంగా అక్షరమణమాల జ్ఞానం కోసం మీరు చదవండి. అన్నం కూడా పెడుతుంది. మన ఇంట్లో ఒక అమ్మాయిని పెళ్లి కూతురిని చేశాము అంటే కొత్త బట్టలు కుట్టిస్తాము. ఆ పెళ్లి కూతురు మనల్ని అడగక్కరలేదు నాకు కొత్త బట్టలు కుట్టించండిఅని, ఎప్పుడైతే మనం పెళ్లి కూతురిని చేశామో, అప్పుడు తప్పనిసరిగా కొత్త బట్టలు కుట్టిస్తాము. అదే విధంగా జ్ఞానం కోసం మనం తంటాలు పడుతుంటే, జ్ఞానం కోసమే అక్షరమణమాల చదువుతుంటే, మనకు ఏదైతే అవసరమో, అవి అన్నీ జ్ఞానం మనకు సమకూర్చి పెడుతుంది. మనకి బట్టలు కావలసి ఉంటే బట్టలు. గౌరవాలు కావలసి ఉంటే గౌరవాలు. అన్నం కావలసి ఉంటే అన్నం, మీకు ఏది కావాలో అది జ్ఞానం సమకూర్చి పెడుతుంది. జ్ఞానం అంటే ఏమిటి? పరమేశ్వరుడు. జ్ఞానం ఎవరికి వస్తుంది? శ్రద్ధ ఉన్నవారికి జ్ఞానం వస్తుంది. మీకు అందరికి ఎంతో కొంత శ్రద్ధ ఉంది కాబట్టి ఈ రోజున వినటానికి ఇక్కడకు వచ్చారు. శ్రద్ధ వల్ల జ్ఞానం వస్తుంది, జ్ఞానం వల్ల మోక్షం వస్తుంది.

రమణమహర్షి ఏవో కొన్ని మాటలు చెప్పారు, అదే విధంగా రామకృష్ణుడు ఏవో కొన్ని మాటలు చెప్పాడు, అదే విధంగా యేసు ఏవో కొన్ని మాటలు చెప్పాడు. వారు వ్యాపారం కోసం చెప్పారా? ఇది ఏమైనా కొబ్బరికాయ వ్యాపారమా? తవుడు వ్యాపారమా? ఎందుకు చెప్పారు? మానవజాతి మీద వాళ్లకి ఉన్న ప్రేమ, ఆ అఫెక్షన్ అది ఆపుకోలేక, ఆ ప్రేమ ప్రవాహం పొంగి పొంగి మాటల రూపంలో బయటకు వచ్చింది. రమణస్వామి చెప్పిన మాటలు కాని, రామకృష్ణుడు చెప్పిన మాటలు కాని, అవి మాటలు కాదు, అది ప్రేమ. మనుషుల మీద వాళ్ల హృదయంలో ఉన్న ప్రేమే, అది మాటల రూపంలో అది అక్షరమణమాల అనండి, Gospel of Sri Rama Krishna అనండి, లేకపోతే వేదం అనండి, లేకపోతే బైబిల్ అనండి,

వాళ్ళు వ్యాపారం కోసం చెప్పిన మాటలు కాదు, గొప్పల కోసం చెప్పిన మాటలు కాదు, గౌరవాల కోసం చెప్పిన మాటలు కాదు, మానవజాతిని వాళ్ళ స్థాయికి తీసుకు వెళ్ళడం కోసం, మానవుడు శారీరకంగా, మానసికంగా పడుతున్న బాధల నుండి విడుదల పొందటం కోసం, వాళ్ళు తపన పడి, తపన పడి కేవలం మానవజాతి మీద ఉన్న ప్రేమ కొలది వాళ్ళు కక్కినటువంటి మాటలు అవి. ఎవడైతే జ్ఞానం సంపాదించాడో వాడు ప్రేమస్వరూపుడు అవుతాడు. ఎవడైతే జ్ఞానం సంపాదించాడో వాడు స్వార్థం నుండి విడుదల పొందుతాడు. ఏ మనిషికి అయితే స్వార్థం ఉందో ఆ మనిషికి జ్ఞానం లేదు. స్వార్థం ఉన్న మనిషికి జ్ఞానం కలగదు. స్వార్థం ఉన్న మనిషి ప్రేమించలేడు. మీరు లోకాన్ని ప్రేమించాలి అంటే, ఈశ్వరుణ్ణి ప్రేమించాలి అంటే, స్వార్థం అనే గూడులోంచి ఆ మనిషి బయటకి రావాలి. సోదరమహాశయులారా, ఈ జ్ఞానం అటువంటిది. తోటి మానవుడు పట్ల వాళ్ళకున్న ఆప్యాయత, వాళ్ళకున్న ప్రీతి అది ఆపుకోలేరు.

ఒక చిన్న ఉదాహరణ చెబుతాను. ఒకసారి పూరిలో జగన్నాథస్వామివారి ఊరేగింపు జరుగుతోంది. శ్రీ కృష్ణ చైతన్య, జగన్నాథస్వామిని చూస్తున్నారు. జనం ఎక్కువగా ఉన్నారు వాళ్ళు అందరిని గెంటుకు వెళ్ళడం ఎందుకు అని, అలా కూర్చుని ఉన్నాడు. ఈలోపు ఒక అమ్మగారు ఏమి చేశారు అంటే తల పైకెత్తి చూస్తోంది ఆవిడ పాపం పొట్టేమో, జగన్నాథస్వామి కనపడటం లేదు. ఎదురుగుండా జనం, ఈ చైతన్యుడు కూర్చొన్నాడు కదా, ఎవడో దూడలు కాచుకునే కుర్రవాడిలాగా ఉన్నాడు. ఆయన శ్రీ కృష్ణ చైతన్యుడు అన్న సంగతి పాపం ఆ అమ్మగారికి తెలియదు. ఆ అమ్మగారు పొట్టి జగన్నాథస్వామి కనిపించటం లేదు, చూడాలని లోపల ఆత్రుత. ఈ చైతన్యుడు భుజాల మీద ఎక్కి నుంచుంది. ఈ చైతన్యుడు ఏమి చేస్తున్నాడు, పాపం జగన్నాథస్వామిని ఆవిడ చూస్తోంది మనం కదలకూడదు అని అలాగే కూర్చొన్నాడు. ఈ లోపల చైతన్యస్వామి శిష్యులు అక్కడకు వచ్చారు. ఇదేమిటి మహాపురుషుడు, అవతారపురుషుడు, కృష్ణుడి యొక్క అవతారం, ఈ అమ్మగారు ఎవరు?

**భక్తి యోగం, జ్ఞాన యోగం, ధ్యాన యోగం, కర్మ యోగం - ఇవన్నీ వేరుగా మనకి కనిపిస్తున్నాయి. కాని అన్ని యోగాల లక్ష్యం ఒక్కటే; మీ హృదయంలోని నిజాన్ని తెలుసుకోవటం.**



చైతన్యుడి మీద నిలబడి రథం చూస్తోంది అని తిట్టడానికి సిద్ధపడి దగ్గరకు రాబోతుంటే చేతులు పెట్టి ఇలా వారించాడు. ఏమి కదపకండి, కదపకండి అని, అప్పుడు శిష్యులు అలాగే ఉండిపోయారు. ఆవిడ ఐదు నిముషాలు, పది నిముషాలు ఆ జగన్నాధస్వామి వంక చూసింది. చూసి హమ్మయ్య! ఎంత బావుందో అనుకుని ఆకాళ్ళు కింద పెట్టింది. మన గురువు, దేవుడు తోటి సమానం, ఆయనని మనం పూజించుకుంటున్నాం అని శిష్యులకి ఎంతో కోపం వచ్చేస్తుంటే, ఆ ఎక్కిన అమ్మగారు ఈయన భుజాల నుంచి కాళ్ళు కింద పెట్టాక, చైతన్యుడు వెంటనే ఆవిడ కాళ్ళకి నమస్కారం పెట్టి, అమ్మా మీ భక్తికి సంతోషం అమ్మా, కింద ఎవరు ఉన్నారో నీకు తెలియటం లేదు. నీ భక్తికి సంతోషం. ఆ విగ్రహాన్ని చూడాలని, భగవంతుడిని చూడాలని, ఎంతో ఆత్రుతగా చూశావు. నీ పాదాలకి నమస్కారం అమ్మా, భుజాల మీదకి ఎక్కినందుకు కోపం ఏమి రాలేదు పైగా తిరిగి ఆవిడ పాదాలకు నమస్కారం పెట్టాడు. ఎందుకు? ఆవిడకున్న భక్తికి ప్రణమిల్లాడు. అమ్మా నిన్ను ఆదర్శంగా తీసుకోవాలి. ఎంత భక్తురాలివి అమ్మా, నీ ఏకాగ్రతకి సంతోషం అమ్మా, హృదయంలో పరమేశ్వరుడు పట్ల నీకు ఉన్న ప్రీతికి సంతోషం అమ్మా, అని ఆవిడ పాదాలకి శ్రీ కృష్ణ చైతన్యుడే నమస్కరించాడు. అది జ్ఞాని యొక్క లక్షణం.

నిజంగా నీ అదృష్టం బావుండి, పూర్వజన్మ సుకృతం బాగుండి, ఎవరైనా మహాత్ముల సహవాసం నీకు దొరికితే నీకు అతి తేలికగా మోక్షం వస్తుంది. జీవుల యొక్క అజ్ఞానాన్ని తొలగించటం కోసం, ప్రతీ మనిషిని జ్ఞానిని చెయ్యటం కోసం, ఈ ప్రకృతి లోంచి, ఈ విష వలయం లోంచి మానవుడిని బయటకు తీసుకురావటం కోసం, మనసుని లోపలకి పంపించటం కోసం తగినటువంటి మాలని నేను తయారు చేస్తున్నాను. ఈ అక్షరమణమాల ని తయారు చేస్తున్నాను. అందుచేత ఈ పని పూర్తి అయ్యేలాగా నన్ను అనుగ్రహించు ఓ గణపతి అంటున్నాడు రమణస్వామి.

**అరుణాచల మనుచు స్మరియించువారల అహమునిర్మూలింతువరుణాచల**

మోక్షం రావాలి అంటే కర్మయోగం చెబుతున్నారు, భక్తియోగం చెబుతున్నారు, ధ్యానయోగం చెబుతున్నారు. భగవద్గీతలో ఎన్నో యోగాలు చెప్పారు. రమణస్వామి చెప్పేది కొంతమందికి బుర్రకి ఎక్కదు. కొంతమందికి భక్తిమార్గం చెబితే బుర్రకు ఎక్కుతుంది. అలాగే కొంతమందికి కర్మమార్గం చెబితే బుర్రకు ఎక్కుతుంది. కొంతమందికి మాములుగా

వైరాగ్యం ఇష్టం ఉంటుంది సహజంగా, వాళ్లకి జ్ఞానమార్గం అంటే ఇష్టం. పది మందికి ఏదో ఒక ఉపకారం చెయ్యాలి, పది మందికి సేవ చెయ్యాలి అని సహజంగా ఎవరి ప్రవృత్తి అయితే ఉందో వాళ్లకి కర్మమార్గం అంటే ఇష్టం. కొంతమందికి భగవంతుడు పేరు చెబితే చాలు రామనామం, కృష్ణనామం, శివనామం చెబితే చాలు ఒళ్లు జలధరిస్తుంది. వెంట్రుకలు అలా నిలబడతాయి. శరీరం అంతా గగుర్పాటు వచ్చినట్టు ఉంటుంది. శివనామం చెప్పినా, కృష్ణనామం చెప్పినా, రామనామం చెప్పినా, భగవంతుడు పేరు స్మరణకి వచ్చేటప్పటికి ఎవరికి అయితే శరీరం పులకరిస్తుందో, ఎవరికైతే మనసు పులకరిస్తుందో, వాళ్లకి భక్తిమార్గం అంటే ఎక్కువ ఇష్ట పడతారు. వాళ్ల పూర్వజన్మ సుకృతాన్ని బట్టి, వాళ్ళు పూర్వజన్మలో చేసిన సాధన బట్టి ఒక్కొక్క ప్రవృత్తి ఒక్కొక్కళ్ళు ఇష్ట పడతారు. ఇక్కడ అక్షరమణమాల ప్రధానం కాదు, అక్షరమణమాల రచన చేసేటప్పుడు భగవాన్ హృదయం మనకి ప్రధానం.

**అరుణాచల మనుచు స్మరియించువారల అహమునిర్మూలింతువరుణాచల**

Only remembrance of Arunachala gives Moksha. ఊరికే అరుణాచల, అరుణాచల, అరుణాచల అని స్మరించుకోండి, మీకు మోక్షం వస్తుంది, మీకు శాంతి వస్తుంది, మీకు కాంతి వస్తుంది. మీరు స్వరూపాన్ని పొందుతారు, మీరు ఆత్మని పొందుతారు. మీరేమి కష్టపడక్కర్లేదు. ప్రీతిగా మీరు అరుణాచల, అరుణాచల, అరుణాచల, అని ఆయన స్మరణ చాలు. Only remembrance of Arunachala gives Moksha, gives knowledge, gives peace, gives enlightenment కేవలం అరుణాచలం యొక్క స్మరణ చాలు, మీకు సమాధిస్థితి వస్తుంది. ఆ స్మరణ చాలు, మీకు మోక్షం వస్తుంది. ఆ స్మరణ చాలు, మీ బుద్ధికి, మీ ఇంద్రియాలకి అందనటువంటి పరమశాంతిని మీరు పొందుతారు. మీకుయోగం తోటి పని లేదు.

అరుణాచలమనుచు స్మరించు వారలఎవరైతే అరుణాచల, అరుణాచల, అరుణాచల అని ప్రీతిగా, వాళ్ల దేహాన్ని మర్చిపోయి, వాళ్ల అహంకారాన్ని మర్చిపోయి, వాళ్ల మనసుని మర్చిపోయి, వాళ్ల ఇంద్రియాలను మర్చిపోయి, కేవలం ఏకాగ్రత తోటి, నిర్మలమైన బుద్ధి తోటి అరుణాచల, అరుణాచల శివా అని హృదయపూర్వకంగా స్మరణ మాత్రమే చాలు, మీరు ఏమి కష్టపడవద్దు, ఏమి యోగాభ్యాసాలు చెయ్యవద్దు, ప్రాణాయామాలు చెయ్యవద్దు, ఏమి నోములు అక్కర్లేదు, వ్రతాలు అక్కర్లేదు, హృదయపూర్వకంగా ఆయన స్మరణే చాలు అని చెప్పారు. ఈ మధ్యన ఎవరో ఒకరు నేను చాలా దానాలు చేశాను అని నాతో చెప్పారు. అతనికి నేను చెప్పాను మీరు చేసిన దానాల వల్ల పుణ్యం వస్తుంది. ఆ పుణ్యం అంతా మీరే అనుభవించండి.

ఆ పుణ్యం మటుకు మీరు ఎవరికీ వాటా పంచిపెట్టక్కర్లేదు అని వారికి సలహా చెప్పాను.

ఈ సందర్భంలో గౌతమబుద్ధుడి మాట ఒకటి జ్ఞాపకం వస్తోంది. కర్తృత్వం తోటి చెప్పే మాటలు ఎలా ఉంటాయి అంటే, గౌతమబుద్ధుడి టైములో బింబిసార అనే మహా చక్రవర్తి ఒక యజ్ఞం చేశాడు. పూర్వం యజ్ఞాలు చేసి, యాగాలు చేసి గొర్రెలని, మేకల్ని చంపేవారు. యజ్ఞాలు చేస్తే, హోమాలు చేస్తే, పుణ్యం వస్తుంది అని రాజు గారి ఉద్దేశం. గొర్రెలమందని తోలుకు వెళ్తున్నారు యజ్ఞంలో ఆహుతి చెయ్యటం కోసం, అందులో ఒక కుంటి గొర్రె నడవలేకపోతుంటే, ఆ కుంటి గొర్రెను పట్టుకుని గొర్రెల కాపరి కొడుతున్నాడు. మిగతా గొర్రెల తోటి కుంటి గొర్రె ఎలా నడుస్తుంది పాపం, నడవలేకపోతోంది. గౌతమ బుద్ధుడు ఆ దృశ్యం చూశాడు, ఆయన ఈ కుంటుతున్న గొర్రెని తన భుజం మీద వేసుకున్నాడు. ఏవండీ దీనిని కొట్టకండి మిగతా గొర్రెల తోటి దీనిని కూడా నేను తీసుకు వస్తాను. ఆ కుంటుతున్న గొర్రెని తన భుజం మీద వేసుకుని గౌతమ బుద్ధుడు యజ్ఞశాలకి వెళ్ళాడు. ఒక్కొక్క గొర్రెని చంపటానికి సిద్ధం చేస్తున్నారు. బొట్లు పెడుతున్నారు. దేనికి బొట్లు పెట్టడం? గౌరవించటానికి కాదు, వాటిని నరకడానికి, కొంతమంది చేసే మర్యాదలు అలాగే ఉంటాయి. లోపల వేరే ఉద్దేశం, స్వార్థం పెట్టుకుని కొంతమంది మర్యాదలు చేస్తారు. అవి మర్యాదలా? కాదు. అప్పుడు గౌతమ బుద్ధుడు అన్నాడు, ఓ చక్రవర్తి, ఓ రాజా, ఓ మహారాజా, నువ్వు ఈ గొర్రెలు అన్నిటిని చంపుతున్నావు. ఎందుకు చంపుతున్నావు? ఈ హోమంలో గొర్రెలని చంపితే నీకు పుణ్యం వస్తుంది అని నువ్వు చంపుతున్నావు. ఈ కుంటి గొర్రెని నేను తీసుకు వచ్చాను. అది నడవలేక పోతుంటే, ఈ కాపరి కొడుతుంటే, ఆ బాధ చూడలేక ఆ గొర్రెని ఎత్తుకు వచ్చాను. అందుచేత ఈ గొర్రెలని అన్నిటిని చంపి, ఈ కుంటి గొర్రెని మటుకు వదిలేయ్, ఊరికే వదిలేయవద్దు. ఈ కుంటి గొర్రె తల నరికే బదులు నా తలకాయ తీసేయ్. నీ పుణ్యానికి ఏమి నష్టం లేదు, ఒక సామాన్యమైనటువంటి గొర్రెని చంపితే నీకు అంత పుణ్యం వస్తే, నా వంటి మనిషిని చంపితే నీకు ఎంత పుణ్యం వస్తుంది మహారాజా, అందుచేత ఇటువంటి పని చేసి నువ్వు పుణ్యం సంపాదించుకో, నేను పుణ్యం సంపాదించుకోవద్దు అనటం లేదు. నువ్వు పుణ్యం సంపాదించుకో, ఈ గొర్రెని చంపే బదులు నన్ను చంపు. అప్పుడు నీకు ఇంకా అధికంగా పుణ్యం వస్తుంది అని చెప్పాడు. పుణ్యం కోసం ఎంతో మందిని బలి చేసేసి, ఎంతో మందిని అగ్నికి ఆహుతి చేసి, వాళ్ళు పుణ్యం సంపాదిస్తారు, వీళ్ళకి జ్ఞానమా? పుణ్యం చేస్తే మంచి లోకాలకు వెళ్ళొచ్చు, పాపం చేస్తే చెడ్డ లోకాలకు వెళ్ళవచ్చు. ఆచార్యులస్వామి వారు ఒక మాట

అన్నారు. మన అందరికి యమధర్మరాజు అంటే భయం, కాని మన్మధుడు అంటే ఇష్టం, ఈ మన్మధుడు మనకి చేసేది ఏమిటి అంటే, పాపం పోగు చేసి పెడతాడు. యముడు ఏమో చేసిన పాపాన్ని కడుగుతాడు. మనకి ఎవరంటే ఇష్టం, పాపాన్ని కడిగే యముడు అంటే ఇష్టం ఉండదు, పాపాన్ని తెచ్చే మన్మధుడు అంటే మనకి బాగా ఇష్టం, మన యొక్క లక్షణాలు ఇలా ఉన్నాయి అని ఆచార్యుల వారు చెప్పారు. అరుణాచల, అరుణాచల అని ఎవరైతే స్మరిస్తున్నారో, ఎవరైతే తలపెడుతున్నారో, ఎవరైతే ఆ స్మరణలో జీవిస్తూ, ఆ స్మరణలో ఎవరికి అయితే ప్రాణం పోతుందో, వాళ్లకి తప్పనిసరిగా మోక్షం వస్తుంది అని భగవాన్ ఒకసారి చెబుతుంటే ఒకడు ఏమి అన్నాడు అంటే మీరు అలా చెబుతున్నారు, అరుణాచలాన్ని స్మరించుకుంటేనే మోక్షం వచ్చేస్తుందా? మోక్షం అంటే అంత తేలిగ్గా ఉందా? అని అడిగాడు. అది ఈశ్వరుడి ఆజ్ఞ, అడగటానికి నువ్వు ఎవడవు? కాశీలో మరణిస్తే మోక్షం వస్తుంది, అరుణాచలాన్ని స్మరిస్తే మోక్షం వస్తుంది. చిదంబరాన్ని దర్శిస్తే మోక్షం వస్తుంది అని ఈశ్వరుడు చెప్పిన ఆజ్ఞ. అడగటానికి నువ్వు ఎవరవు? నువ్వు అరుణాచలాన్ని స్మరించి చూడు అప్పుడు నీకు మోక్షం రాకపోతే అడుగు. అసలు నువ్వు సాధన చెయ్యకుండా, స్మరణ చెయ్యకుండా, కాలు కదపకుండా, నోరు మెదపకుండా, ఏమి ప్రయత్నం చెయ్యకుండా, వస్తుందా రాదా అని అనుమానం పెట్టుకుంటావు ఏమిటి? అరుణాచలాన్ని స్మరిస్తేనే ముక్తి వచ్చేస్తుందా అంటే వస్తుంది, వచ్చి తీరుతుంది. అనుమానించడానికి నువ్వు ఎవరవు? ప్రశ్నించడానికి నువ్వు ఎవరవు?

అరుణాచల మనుచు స్మరించువారల ఎవడి అబ్బ గారి సొమ్ము అండి, స్మరించుకోవాలి అంటే మనం స్మరించుకోగలమా? ఎన్ని గొడవలు జ్ఞాపకం వస్తాయో మనకి, ఊరికే అరుణాచలం స్మరణ అని రమణస్వామి చెప్పారు. నిరంతరం మీరు ఆ స్మరణలో ఉండగలరా? నిరంతరం మీ దేహాన్ని మర్చిపోయి, మీ అహంకారాన్ని మర్చిపోయి, మీ మనసుని మర్చిపోయి, మీ రూపాలని మర్చిపోయి, మీ గౌరవాలని మర్చిపోయి, మీ అగౌరవాలని మర్చిపోయి, మీ గొప్పలని, మీ ఆస్తులను మర్చిపోయి, అరుణాచల అని నిరంతరం స్మరించగలమా మనం? మన గౌరవాలు జ్ఞాపకం వస్తాయి. మన గొప్పలు జ్ఞాపకం వస్తాయి. మన కులాలు, గోత్రాలు మనకి జ్ఞాపకం వస్తాయి కాని అరుణాచల శివుడు జ్ఞాపకం వస్తాడా మనకి? మీ దేహాలను మర్చిపోయి, మీ రూపాయలను మర్చిపోయి, మీ ఆస్తులు మర్చిపోయి, అరుణాచలాన్ని స్మరించగలరా? ఈ మధ్యన మా ఇంటి దగ్గర ఒక అమ్మగారు ఇంకొక అమ్మగారిని అడుగుతున్నారు మీకు ఏమైనా పొలం ఉందా? అని, ఆ

అమ్మగారు అన్నారు మాకు ఏమి లేదు పొలం లేదు అన్నారు. నేను ఏమి మాట్లాడకుండా ఊరుకున్నాను. నేను మీకు ఇప్పుడు సలహా చెబుతున్నాను. మీకు పొలం ఉంటే, పొలం ఉంది అని చెప్పండి. రూపాయలు ఉంటే, రూపాయలు ఉన్నాయి అని చెప్పండి. మీరు ఏమైనా ఉద్యోగాలు చేస్తున్నారా అంటే, ఉద్యోగాలు చేసుకుంటున్నాం అని చెప్పండి. మీకు ఏమైనా బంగారాలు ఉంటే, బంగారాలు ఉన్నాయి అని చెప్పండి. మీకు ఆస్తులు ఉంటే, ఆస్తులు ఉన్నట్టు, మీకు అంతస్తులు ఉంటే, అంతస్తులు ఉన్నాయి అని చెప్పండి. నేను వద్దు అనటం లేదు. మరి అంతస్తులు లేని వాళ్ళు, ఆస్తులు లేని వాళ్ళు, గౌరవాలు లేని వాళ్ళు మరి ఏమని చెప్పాలి? ఏమి లేదు అని చెప్పకండి. మా ఆస్తి అరుణాచలం అని చెప్పండి. అందరికి ఆస్తులు ఉండవు. మీలో ఆస్తులు లేని వాళ్ళు ఉంటే, మాకు ఏమి లేదు అని చెప్పకండి. మీకు ఉంది, మీకు అరుణాచలం ఉంది. మాకు అరుణాచలమే ఆస్తి, మా ఆస్తి అరుణాచలం అని చెప్పండి. ఏమి లేదు అని చెప్పకండి. ఉన్నవాళ్ళు ఉందని చెప్పండి. లేనివాళ్ళు ఏమి లేదు అని చెప్పకండి. మాకు అరుణాచలం ఆస్తి, మాకు అరుణాచలం ఉంది అని చెప్పండి. అరుణాచలం మీ ఆస్తి కాదా? మాకు అరుణాచలం ఉందని మీరు చెప్పుకోలేరా? అరుణాచలేశ్వరుడు అందరి వాడు కాదా? ఎవరో ఒక్కడి వాడేనా? ఎవరో రమణ మహర్షి సొత్తా? ఒక్కడి సొత్తేనా అరుణాచలేశ్వరుడు? ఒక్క రమణ మహర్షిని ఉద్ధరించడానికే అరుణాచలేశ్వరుడు ఒకడు ఉన్నాడా? కాదు, అక్షరమణమాలలో అదే రమణ మహర్షి చెప్పాడు. ఏదో రమణ మహర్షిని రక్షించాం, ఎవరినో ఒకరిని జ్ఞానిని చేశాం, ఎవడికో ఒకడికి మోక్షం ఇచ్చాం, నా పని అయిపోయింది అని నువ్వు అనుకోకు. నన్ను ఏ విధంగా అయితే బాగు చేశావో, నన్ను ఏ విధంగా అయితే ఉద్ధరించావో, నాకు ఏ విధంగా అయితే మోక్షాన్ని ఇచ్చావో, నాకు ఏ విధంగా అయితే శాంతిని ఇచ్చావో, నన్ను ఏ విధంగా అయితే చైతన్యంలో మిళితం చేశావో, బుద్ధికి అందనటువంటి, ప్రకృతికి అందనటువంటి, ఇంద్రియాలకి అందనటువంటి, ఆ పరమశాంతి, ఆ ఉదాత్తశాంతి, ఆ



**అర్చన చేసినా, మత గ్రంధాలు చదివినా, పుణ్యాలు, దాన ధర్మాలు చేసినప్పటికీ,వీటన్నిటి వల్ల ప్రయోజనం మన మనసుని బాగుచేసుకోవటానికే, మనస్సుని నిర్మలం చేసుకోవటానికే, అదే చాలా ముఖ్యం.**

మహోన్నతమైనశాంతిని ఏ విధంగా అయితే నాలో కలిపావో, అటువంటి శాంతి నాకు ఇచ్చేశావు అని, నీ పని పూర్తి అయిపోయింది అని నువ్వు అనుకోకు. నా బోటి దిక్కు లేని వాళ్ళు అందరికి నీవే దిక్కు అయ్యి, నా బోటి ఆస్తి లేని వాళ్ళు అందరికి నువ్వే ఆస్తి అయ్యి, వాళ్ళు అందరిని నువ్వు రక్షించి, వాళ్ళు అందరికి పరమ ప్రశాంతి ప్రసాదించు, వాళ్లకి మోక్షాన్ని ప్రసాదించు అరుణాచలేశ్వరుడా అన్నారు భగవాన్. అందుచేత దిక్కు లేని వాళ్ళు ఎవరు మాకు దిక్కు లేదు అనుకోవద్దు, మీకు ఆస్తులు లేని వాళ్ళు ఎవరు ఆస్తులు లేవు అనుకోవద్దు. ఏమి లేని వాళ్ళకు పరమేశ్వరుడే దిక్కు, మనకు అరుణాచలేశ్వరుడే ఆస్తి.

అజ్ఞానం ఉన్నంతసేపు జన్మలు వస్తాయి. అజ్ఞానం నుండి విడుదల చేయటం కోసం అహంకారం నుండి విడుదల చేయటం కోసం, అవసరం అయితే గురువు రూపంలో అరుణాచలేశ్వరుడు వచ్చి, ఆ సృష్టి కర్త, సర్వ శక్తిమంతుడు అయినటువంటి అరుణాచలేశ్వరుడు ఏ జన్మలో అయినా సరే వచ్చి రక్షిస్తాడు. మన ఆస్తి ఆయనే, ఆయన పట్ల మనం శరణాగతి పొందాలి. కొంతమందికి బంధువులు దిక్కు ఉంటారు, కొంతమందికి స్నేహితులు దిక్కు ఉంటారు, కొంతమందికి దేహబలం ఉంటుంది. కొంతమందికి ధనబలం ఉంటుంది. ఇలా అనేక మందికి అనేక రకాలైన బలాలు ఉండచ్చు. కాని ఏ దిక్కు లేని వాడికి, లోకానికి సంబంధించిన సంపద ఏమి లేని వాడికి, సంపద లేదు మనం దరిద్రులం అని మీరు ఎవరు అనుకోవద్దు. మీకు అరుణాచలేశ్వరుడు అనే ఐశ్వర్యం ఉంది, అరుణాచలేశ్వరుడు అనే దిక్కు ఉంది. అరుణాచలేశ్వరుడు అనే మోక్ష ప్రదాత మీకు ఉన్నాడు. ఇక్కడే ఉన్నాడు, నిజమైన అరుణాచలేశ్వరుడు మన హృదయంలోనే ఉన్నాడు.

అరుణాచల, అరుణాచల, అరుణాచల ఎవరైతే నిన్ను ప్రీతి పూర్వకంగా స్మరిస్తున్నారో, ఎవరైతే హృదయ పూర్వకంగా, నిండుమనసు తోటి, కపటం లేకుండా ఎవరైతే స్మరిస్తున్నారో, వారి యొక్క అహంకారాన్ని నిర్మూలిస్తావు అరుణాచల. వైకుంఠంలోకి వెళ్ళినప్పటికీ, కైలాసంలోకి వెళ్ళినప్పటికీ, అహంకారం ఎంతకాలం అయితే మనలో నాశనం కాదో, అంతకాలం ఈ భూమి మీదకు రావాల్సిందే, ఈ భూమి ఒక ట్రైనింగ్, ఏ అనుభవం పొందటం కోసం అయితే మనం ఈ భూమి మీదకి వచ్చామో, ఆ అనుభవం పొందేవరకు మనం జీవించి ఉంటాం, ఆ అనుభవం పొందిన తరువాత ఆ సెకనులో, ఆ రోజులో మనం ప్రాణం విడిచి పెట్టి బయటకు వెళ్ళిపోతాం. ఏ కర్మ అయితే మనం అనుభవించటానికి ఈ భూమి మీదకు వచ్చామో, ఏ పుణ్యం అయితే అనుభవించటానికి ఈ భూమి మీదకి వచ్చామో, ఏ

పాపం అనుభవించటానికి ఈ భూమి మీదకు వచ్చామో, ఆ అనుభవం పూర్తి అయిన తరువాత, ఈ శరీరం విడిచిపెట్టి బయటకుపోతాము. శిక్షణ పొందటం కోసం ఈ భూమి మీదకు వచ్చాం, కొన్ని పాఠాలు నేర్చుకోవటం కోసం మనం ఈ భూమి మీదకి వచ్చాం, ఆ ట్రైనింగ్ పూర్తి అయిపోయిన తరువాత ఆ బడిలోంచి, ఆ కాలేజీ లోంచి బయటకు ఎలా పంపేస్తారో, ఈ దేహం ఎందుకు వచ్చిందో, ఏ అనుభవం పొందటానికి వచ్చిందో, ఏ శిక్షణ పొందటానికి వచ్చిందో, ఏ ప్రారబ్ధం అనుభవించటానికి దేహం ఈ భూమి మీదకు వచ్చిందో, ఆ ప్రారబ్ధం ఖర్చు అయిపోయిన గంటలో, ఆ నిమిషంలో, ఆ సెకనులో, ఈ భూమి ఖాళీ చేసి మనం వెళ్ళిపోతాం.

ఇక్కడ నేను పుణ్యాలు సంపాదించు కోవచ్చు, ఇక్కడ నేను పాపాలు సంపాదించు కోవచ్చు, మీపుణ్యాలకి మరొక లోకంలో సుఖాలు పొందవచ్చు. మీ పాపాలకి మరొక లోకంలో శిక్షలు పొందొచ్చు. మళ్ళీ మీరు ఈ భూమి మీదకు రావలసిందే. మీరు ఇలా తిరుగుతూ ఉండాల్సిందే. ఇది మీ నిజమైన ఇల్లు కాదు, ఈ ఊరు మీ నిజమైన ఇల్లు కాదు. ఈ దేశం మీ నిజమైన ఇల్లు కాదు. వైకుంఠం మీ నిజమైన ఇల్లు కాదు, కైలాసం మీ నిజమైన ఇల్లు కాదు, మీ నిజమైన ఇల్లు మీ హృదయంలో ఉంది. ఆ హృదయాన్ని మీరు ఆస్వాదించండి. నిజమైన జ్ఞానం మీ హృదయంలోనే ఉంది దానిని మీరు పొందండి. అది పొందాలి అంటే అహంకారం పోవాలి. పుణ్యాలు సంపాదించుకోవడం కాదు, పాపాలు సంపాదించుకోవడం కాదు, వీటన్నిటికి అతీతమైన మోక్షాన్ని మీరు పొందాలి. మీరు శాంతిని పొందాలి అంటే వెళ్ళటాలు, రావటాలు లేని అతీతమైన స్థితిని పొందాలి అంటే మీరు మోక్షం పొందాలి. ఆ మోక్షం మీ హృదయంలోనే ఉంది, అది పుణ్య పాపాల వల్ల వచ్చేది కాదు. అహంకారం వేరుతో సహా, అహంకారం మూలంతో సహా ఎప్పుడైతే తెగిపోయిందో, ఎప్పుడైతే రాలిపోయిందో అప్పుడే మీకు మోక్షం వస్తుంది. విపరీతమైన అతి ధైర్య సాహసాల తోటి వైరాగ్యం అనే కత్తిని పుచ్చుకుని ఎవడైతే తన అహంకారాన్ని నరకగలుగుతున్నాడో వాడే మోక్షాన్ని పొందుతాడు, వాడే జ్ఞానాన్ని పొందుతాడు. అది మీ హృదయంలోనే ఉంది, నిజమైన అరుణాచలేశ్వరుడు ఎక్కడో అరుణాచలంలో లేడు. మీ హృదయంలోనే ఉన్నాడు. మీ అజ్ఞానం అనే వృక్షాన్ని వేరుతో సహా వైరాగ్యం అనే కత్తి పుచ్చుకుని నరుకు. మోక్షం ఇక్కడే ఉంది, నీ హృదయంలోనే ఉంది, నీ కోసం ఎదురు చూస్తోంది. నీ కోసం తపిస్తోంది, నీ మనసుని అంతర్ముఖం చెయ్యి, అరుణాచలాన్ని స్మరించు. అప్పుడు నీ హృదయంలో ఉన్న

అరుణాచలం నిన్ను లోపలకి గుంజుకుంటుంది. నువ్వు మోక్షసామ్రాజ్యానికి అధిపతి అవుతావు. ఎక్కడో వైకుంఠానికి వెళ్ళినా అక్కడ ఎక్కువ రోజులు ఉండటానికి వీలు లేదు. ఈ వడ్లవానిపాలెం వచ్చి ఎన్ని గంటలు కూర్చొంటాం? మళ్ళీ మన స్వస్థానానికి వెళ్ళిపోవాల్సిందే. మీ స్వస్థానం ఈ భారత దేశం కాదు. మీ స్వస్థానం ఈ ప్రపంచం కాదు. మీ స్వస్థానం వైకుంఠం కాదు. మీ స్వస్థానం కైలాసం కాదు. మీ స్వస్థానం మీ హృదయమే, ఆ హృదయంలోనే పరమేశ్వరుడు ఉన్నాడు, ఆ హృదయంలోనే ఆత్మ ఉంది. అక్కడికి చేరుకునేవరకు నీకు కష్టాలు తప్పవు, నష్టాలు తప్పవు, దుఃఖాలు తప్పవు, బాధలు తప్పవు, భారాలు తప్పవు. ఎప్పటి వరకు? నీ హృదయంలో ఉన్న అరుణాచలేశ్వరుడిని నువ్వు తెలుసుకునే వరకు బాధలు తప్పవు. నీ గమ్య స్థానానికి నువ్వు పోవాలి, నీ గమ్య స్థానంలో ఉన్న ఆత్మని విడిచి పెట్టి, హృదయాన్ని విడిచి పెట్టి ఎక్కడకు వెళ్ళినా అక్కడ తాత్కాలికంగా ఉండవలసిందే. అక్కడ నువ్వు సుఖాన్ని అనుభవించు, దుఃఖాన్ని అనుభవించు, లేకపోతే ఐశ్వర్యాన్ని అనుభవించు, ఎక్కడకు వెళ్ళినా, ఈ ప్రకృతిలో ఏ మూలకి వెళ్ళినా, నువ్వు ఎన్నిసార్లు మరణించినా, ఎన్నిసార్లు జన్మించినా, ఎన్ని బాధలు పడినా, తాత్కాలికం అయిన భోగాలు ఎన్ని అనుభవించినప్పటికీ అవన్నీ నిజం కాదు, నీ హృదయంలో ఉన్న సత్యాన్ని తెలుసుకోవాల్సిందే. ఆత్మని తెలుసుకోవాల్సిందే. నిజం కాని దానిని నువ్వు ఎంత కాలం అయితే నిజం అనుకుంటున్నావో, అప్పుడు నీ బుద్ధి అరుణాచలేశ్వరుడు మీదకు మళ్లదు. నువ్వు నిజాన్ని నిజంగా నమ్ము, అప్పుడు నువ్వు అరుణాచలేశ్వరుడిని స్మరిస్తావు, అరుణాచలేశ్వరుడిలో జీవిస్తావు, అరుణాచలేశ్వరుడిలో మరణిస్తావు అని చెబుతున్నాడు భగవాన్ శ్రీ రమణ మహర్షి.

అన్నీ టెంపరరీ పోస్టులే. ఎక్కడకు వెళ్ళిన టెంపరరీ, ఇప్పుడు ఈ లోకంలో ఉన్నాం, ఈ భూమి మీద ఉన్నాం, ఎన్ని సంవత్సరాలు ఉంటాం? పోని మరణిస్తాం, మీరు అందరూ పుణ్యాలు చేసుకుంటారు వైకుంఠానికి వెళతారు, అక్కడ ఎన్ని రోజులు ఉంటారు? లేకపోతే కైలాసానికి వెళతారు, అక్కడ ఎన్ని రోజులు ఉంటారు? ఇక్కడ చచ్చిపోయి ఏ ఢిల్లీలోనో పుడతాం, అక్కడ ఎన్ని రోజులు ఉంటారు? లేకపోతే ఇంకొక చోట పుడతారు, అక్కడ ఎన్ని రోజులు ఉంటారు? ఎక్కడైనా టెంపరరీ పోస్టులే. కేవలం తాత్కాలికమే. కానీ టెంపరరీ ప్లేస్ ఒకటి ఉంది. అక్కడ చీకటి లేదు, అక్కడ దుఃఖం లేదు, అక్కడ suffering లేదు, అక్కడ troubles లేవు, ఏమి లేవు. అక్కడ ఒక ప్లేస్ ఒకటి ఉంది. పరమ శాంతి ప్లేస్ ఒకటి ఉంది.

దానికి మించిన శాంతి కాని, దానికి మించిన సుఖం కాని, దానికి మించిన అంతస్తు కాని, ఇంకొకటి లేదు. అదే మోక్షం. అదే అరుణాచలం. అది ఎక్కడో లేదు. నీకు దూరాన లేదు. అది నీ హృదయంలోనే ఉంది. అరుణాచలాన్ని స్మరించు, దానిని పొందు. అరుణాచలాన్ని అందుకు స్మరించు అంటున్నాడు రమణస్వామి.

అరుణాచలాన్ని స్మరించమని రమణ మహర్షి చెప్పాడు అంటే మనకు స్మరణ వస్తుందా? ఎవరు స్మరిస్తారండి? ఎవరి బాబు గారి సొమ్ము? మన హృదయంలో ఎన్నో గొడవలు ఉన్నాయి. సోదరమహాశయులారా! ఇవాళ మనం పొరపాట్లు చేయొచ్చు. ఎన్ని పొరపాట్లు చేసినప్పటికి అవి మన హృదయంలో ఉండిపోతాయి, ఇవన్నీ మన మనసుకి తెలియకుండా, అవి బయటకు వెళ్ళవు. ముందు మన మనసుకి తెలియాలి, మీరు పుణ్యం చేసినా, మీరు పాపం చేసినా, దాని యొక్క ఫలితం మనసులో అనుభవించి కాని బయటకు వెళ్ళదు. అరుణాచలేశ్వరుడిని స్మరించమని రమణస్వామి చెబుతున్నాడు. మీలో ఎంతమంది స్మరించగలరు? పూర్వ జన్మల్లో అనేక పుణ్యాలు చేస్తే, అనేక మంచి పనులు చేస్తే, నిష్కామ కర్మ చేస్తే, స్వార్థం లేకుండా, ఫలితం ఆశించకుండా, గొప్పలు ఆశించకుండా, మంచి కోసమే మంచి పనులు అలా చేసుకుని రాగా రాగా అప్పుడు ఈశ్వరుణ్ణి స్మరించాలి అనే బుద్ధి నీకు కలుగుతుంది కాని, ఊరికే ఈశ్వరుణ్ణి స్మరించమంటే మటుకు ఎవరు స్మరిస్తారు? ఇందులో ఎంతమంది స్మరించగలరు? మీ దేహాన్ని మర్చిపోయి, మీ మనసుని మర్చిపోయి, మీ అహంకారాన్ని మర్చిపోయి పరమేశ్వరుణ్ణి మీలో ఎంతమంది స్మరించగలరు? మాట తేలికగానే ఉంది ఎంతమంది సంస్కారాలు ఒప్పకుంటాయి? నా సంస్కారం అనుమతి ఇస్తుందా? నా మనసులో ఉన్న అశాంతి, నా మనసులో ఉన్న రుగ్మత, నా మనసులోని చెడ్డ ఆలోచనలు, నా మనసులోని చెడు తలంపులు, ఇవన్నీ అరుణాచల స్మరణ నా చేత చేయనిస్తాయా?

మిమ్మల్ని ఏమి ప్రాణాయామం చేయమనటం లేదు, డబ్బులు ఖర్చు పెట్టి దానాలు చేయమనటం లేదు. ఆవు నెయ్యి ఖర్చు పెట్టి మిమ్మల్ని హోమాలు చేయమనటం లేదు. అరుణాచల అరుణాచల అనే స్మరణ మాత్రం చేత మీకు మోక్షాన్ని ఇచ్చే క్షేత్రం అరుణాచలం. మీ దగ్గర నుండి ఏమి ఆశించటం లేదు. ఊరికే స్మరణ మాత్రమే ఆశిస్తున్నారు. నిజంగా నువ్వు అరుణాచలాన్ని స్మరణ చేస్తుండగా, చేస్తుండగా నీకు తెలియకుండానే నీ యొక్క అహంకారాన్ని కాల్చేసి బూడిద చేస్తాడు. నాకు ఏది మంచిదో నాకు తెలియదు. ఏది

మంచిదో నాలో ఉన్న పరమేశ్వరుడికి తెలుస్తుంది. నా అహంకారం పోవడం నాకు చాలా మంచిది. ఏదైతే పోతే నేను మోక్షాన్ని పొందుతానో, నాకు ఆటంకంగా ఉన్న అహంకారాన్ని కాల్చేసి బూడిద చేస్తాడు. అరుణాచలేశ్వరుడా నిన్ను ఎవరైతే స్మరిస్తున్నారో వాళ్ల అహంకారం తీసేయ్ అని నేను recommendation చేయడం లేదు. అది నీ వృత్తి, అది నీ ధర్మం, ఎవడైతే వాడి బుద్ధిని, వాడి మనసుని, వాడి శరీరాన్ని మొత్తం మానవుడికి ఉన్న శక్తులు అన్నీ కూడా కేంద్రీకరించి ఎవడైతే అరుణాచలాన్ని స్మరిస్తున్నాడో, అరుణాచలేశ్వరుడు వాడి అహంకారాన్ని తీసేసే పని పెట్టుకున్నాడు. అది ఆయన పని, నేను ఏమి చేయమని ఆయనకు చెప్పడం లేదు. అరుణాచలేశ్వరుడు చేసే పని మీకు చెబుతున్నాను. అంతేగాని ఓ అరుణాచలేశ్వరుడా ఫలానా వాడు అరుణాచల అని స్మరిస్తున్నాడు. వాడి అహంకారాన్ని తీసేయ్ అని నేను recommendation చేయడం లేదు. ఆయన చేసే పని మీకు చెబుతున్నాను అంటున్నారు రమణస్వామి.

**అరుణాచల మనుచు స్మరియించువారల అహమునిర్మూలింతువరుణాచల**

రాత్రనక, పగలనక గంటలను మర్చిపోయి, రోజులు మర్చిపోయి, అమావాస్య, పౌర్ణమి తిథులు కూడా మర్చిపోయి, సమస్తం మర్చిపోయి తన ఇంద్రియాలని, తన మనసుని, తన అహంకారాన్ని అరుణాచల స్మరణలో ఎవడైతే నానబెట్టుకుంటున్నాడో, వాడి యొక్క అహంకారాన్ని మూలంతో సహా తీసేసే స్వభావం నీలో ఉంది. ఇదే చెబుతున్నాను. నువ్వు అలా చెయ్యి, ఇలా చెయ్యి అని చెప్పటానికి నేను సరిపోతానా! సరిపోను. కాని నువ్వు చేసే పని ఈ భక్తులకు చెపుతున్నాను. నీ గొప్పతనం చెపుతున్నాను. నువ్వు ఎంతటి వాడవో ప్రజలకు తెలియదు కాబట్టి చెపుతున్నాను. నిన్ను స్మరించి ధన్యులు అవుతారని, నిన్ను స్మరించి తరిస్తారని, నిన్ను స్మరించి జ్ఞానస్థితిని పొందుతారని, జ్ఞానసింహాసనం పొందుతారని ఇవన్నీ చెపుతున్నాను అరుణాచలా.

**మీరు నరకానికి వెళ్ళినా స్వర్గానికి వెళ్ళినా మనస్సే కారణం.**
**మీరు బంధంలోకి వెళ్ళినా, లేకపోతే మోక్షం సంపాదించినా**
**మనస్సే కారణం. అందుచేత మనసు చాలా ప్రధానం.**
**మనసుని బాగుచేసుకోవాలి.**





# శ్రీమద్భగవద్గీత

## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహ భాషణముల నుండి)

**రాజవిద్యా రాజగుహ్యం, పవిత్రమిదముత్తమం ।**

**ప్రత్యక్షావగమం ధర్మ్యం, సుసుఖం కర్తుమవ్యయం ॥ 09-02 ॥**

**తాత్పర్యం:** ఈ విజ్ఞానసహితజ్ఞానము (నిర్గుణ సగుణ పరమాత్మ తత్త్వ జ్ఞానము) అన్ని విద్యలకును తలమానికము. సమస్త గోప్యవిషయములకును శిరోభూషణము. అతి పవిత్రము. ఉత్తమోత్తమము. ప్రత్యక్ష ఫలదాయకము. ధర్మయుక్తము. సాధన చేయుటకు మిక్కిలి సుగమము. శాశ్వతము.

లోకంలో అనేక విద్యలు కానీ ఇది రాజ విద్య అంటున్నాడు భగవంతుడు వాసుదేవస్వామి. కెమిస్ట్రీ, ఫిజిక్స్, లెక్కలు, ఇంజినీరింగ్ కోర్సు, డాక్టర్ కోర్సు, ఇలా లోకంలో అనేక విద్యలు ఉన్నాయి. కానీ ఆత్మ విద్య, బ్రహ్మ విద్య, రాజు అంటున్నాడు. రాజు అంటే శ్రేష్టమైనది ఉత్కృష్టమైనది, అన్ని విద్యల కంటే గొప్పది. ఇందులో గొప్ప ఏముందండీ అని మీరు అడగవచ్చు. ఒక బ్రహ్మ విద్య తప్పించి మిగతా అన్ని విద్యలూ కూడా సంసారాన్ని పెంచుతాయి అంతే. మీరు ఎన్ని విద్యలు నేర్చుకోండి, మీరు ఏ దేశం వెళ్లి నేర్చుకొని వచ్చినా సరే, ఒక బ్రహ్మ విద్య తప్పించి మిగతా అన్ని విద్యలూ సంసారానికి పనికి వస్తాయి. ఆ జన్మకా జన్మ సంసారాన్ని పెంచుతాయి! మిగతా విద్యలు బలం కాదు, వాపు! బోదకాలు ఉన్నవాడు నేను చాలా బలంగా ఉన్నాను అనుకొంటాడా అండీ!

ఈ బ్రహ్మవిద్య రహస్యం అని చెప్పతున్నాడు వాసుదేవుడు. ఇది రమణమహర్షికి రహస్యమా, కృష్ణుడికి రహస్యమా, లేకపోతే రాముడికి రహస్యమా? ఇది తెలియని వాడికి రహస్యం! అయితే ఇది రహస్యం అని చెప్పటంలో భగవంతుని ఉద్దేశం ఏమిటంటే, ఇది చాలా లోతైన విద్య, చాలా గంభీరమైన విద్య, అద్భుతమైన విద్య, అపూరమైన విద్య, చాలా

ఉదాత్తమైన విద్య! కొన్ని చెరువులు చాల పెద్దవే కానీ దిగితే అసలు మోకాళ్ళ లోతు కూడా ఉండవు. కొన్ని చెరువులు చాలా చిన్నవి కానీ లోతు, మనిషి మునిగిపోతాడు. అలాగే కొంతమంది మనస్సులు కొంచెం విశాలంగా ఉంటాయి కానీ లోతు అసలు ఉండదు. కొంతమంది మనసులు కొంచెం లోతు ఉంటాయి కానీ విశాలత్వం అసలు ఉండదు. ఈ బ్రహ్మవిద్య కావాలంటే లోతూ ఉండాలి విశాలత్వం ఉండాలి. వాడిని జ్ఞానం వరిస్తుంది.

"రాజవిద్యా రాజగుహ్యం, పవిత్రం ఇదం ఉత్తమం..." ఈ బ్రహ్మవిద్యని ఎవడైతే నేర్చుకొంటున్నాడో, అలవాటు చేసుకొని, శ్రవణం మననం చేసి, దైనందిన జీవితంలో ఎవరైతే ఆచరిస్తున్నాడో, అట్టి ప్రతివాడిని పవిత్రం చేస్తుంది. మీలో లోపాలు బలహీనతలు ఉన్నప్పటికీ, ఈ బ్రహ్మవిద్యని కనుక మీరు శ్రవణం చేస్తూ ఉంటే, మీ లోపాలని పోగొడుతుంది. బ్రహ్మవిద్య తప్పించి ప్రపంచంలో మిగతా ఎన్ని విద్యలు ఉన్నప్పటికీ, అవేవీ మిమ్మల్ని పవిత్రుడిని చెయ్యవు. అవి పొట్ట పోషిస్తాయి అంతే!

"ప్రత్యక్షావగమం" - ఈ బ్రహ్మవిద్య పవిత్రుడిని చెయ్యటమే కాదు, సాక్షాత్తుగా ఇప్పుడే ఇక్కడ కూర్చొని ఉండగానే, ఈ నిమిషంలో మీకు ఫలితాన్ని ఇస్తుందట. అదీ రహస్యం! మీరు లక్ష వత్తుల నోము నోచుకోండి వచ్చే జన్మలో పుణ్యం వస్తుంది. లేకపోతే రోజూ జపం చేసుకోండి మళ్ళీ జన్మ మంచి జన్మ వస్తుంది, లేకపోతే ఎక్కువగా దానధర్మాలు చేసుకోండి వచ్చేజన్మలో ధనవంతుల ఇంటిలో పుడతారు! ఈ నోము నోచుకోండి, ఈ వ్రతం చేసుకోండి, జపం చేసుకోండి, ఇది ఇలా చేసుకోండి, అది అలా చేసుకొంటే మంచి జన్మ వస్తుంది, మంచి లోకం వస్తుంది, గొప్ప గొప్ప శరీరాలు వస్తాయి, మీకు ఎంతో గౌరవం వస్తుంది, కీర్తి వస్తుంది, మీరు విద్యావంతులు అవుతారు, ధనవంతులు అవుతారు, అదృష్టవంతులు అవుతారు అని ఇలా ఎన్నో రకాలు వేదాలలో చెప్పారు, ఉపనిషత్తులలో చెప్పారు. కాని వాసుదేవస్వామి అలా చెప్పటం లేదు. "ప్రత్యక్ష ఆవగమం" ఇప్పుడే ఇక్కడే సాక్షాత్తుగా ఆత్మ మీకు దర్శనం ఇస్తుంది. మీరు మరణించిన తరువాత కాదు, వాయిదాలు లేవు. ఈ బ్రహ్మవిద్య వల్ల, ఆత్మ విద్య వల్ల, ఈ మోక్ష విద్య వల్ల, నీకు ఆ జన్మలోనే, ఈ దేహంలో ఉండగానే నీకు సాక్షాత్తుగా ఆత్మ దర్శనం అవుతుంది. ఇప్పుడే ఇక్కడే, ఇంకో గంట, ఇంకో నిమిషం ఏమీ లేవు. ఈ బ్రహ్మవిద్య నీకు అప్పటికప్పుడు సాక్షాత్తుగా ఫలితాన్ని ఇస్తుంది.

ధర్మ్యం - ఆత్మవిద్య ధర్మ విరుద్ధంగా ఉండదు. అది ధర్మ స్వరూపమే. ధర్మం ఒక్కటే పుణ్యం, భగవంతుడి స్వరూపమే ధర్మం. దుష్టులను శిక్షించటానికి, శిష్టులను రక్షించటానికి, ధర్మాన్ని స్థాపించటం కోసం నేను ఈ లోకంలో అవతరిస్తున్నాను అని కృష్ణుడు చెప్పాడు,

భగవంతుడు ఆ పని చూసుకొంటాడు.

"సుసుఖం" - ఈ బ్రహ్మవిద్యని చాలా తేలికగా ఆచరించవచ్చు అని భగవంతుడు చెపుతున్నాడు. అన్ని విద్యలలోకి బ్రహ్మవిద్య చాల కష్టం అని మన తలంపు, మన ఊహ. ఇక్కడ భగవంతుడు దానికి విరుద్ధంగా చెప్పుతున్నాడు.

"కర్తుమవ్యయం" - మీ వ్రతాలు పుణ్యాలు దానాలు ధర్మాలు వీటన్నిటి వల్ల వచ్చే ఫలితం నాశనం అవుతుంది. కానీ ఈ ఆత్మ విద్యవల్ల వచ్చే ఫలితం ఎన్నటికీ నాశనం కాదు. దీనికి నాశనం లేదు. అది చిరస్థాయిగా ఉంటుంది. ఈ లోకం ఆ లోకం అని లేదు, ఈ దేహం ఆ దేహం అని లేదు, ఇది సర్వత్రా వ్యాపించి ఉంది. దీనికి నాశనం అనేది లేనే లేదు అని ఘంటాపధంగా భగవంతుడు చెపుతున్నాడు.

మీ దగ్గర వంద రూపాయలు ఉంటే, పది రూపాయలు ఖర్చు పెడితే, పది రూపాయలు తరిగి తొంబై రూపాయలలోకి వస్తుంది. ఆత్మని అనుభవించే కొలదీ, ఈ బ్రహ్మవిద్యని అనుభవించే కొలదీ, ఈ శాంతిని సుఖాన్నీ మీరు అనుభవించే కొలదీ, ఇది తరగదు. ఎంత అనుభవించినా కానీ, ఇది పెరుగుతుంది కానీ తరగదు. దీనికి నాశనం లేదు అని భగవంతుడు మరోసారి మరోసారి మీకు చెపుతున్నాడు. ఒక్కసారి మీలో ఉన్న ఆత్మ, మీరు కొంచెం రుచి చూస్తే, ఇంతకుముందు మీరు లోకంలో అనుభవించిన సుఖాలు, మీ శరీరం తోటి మీ ఇంద్రియాలతోటి మీరు అనుభవించిన సుఖాలు, మీ ఆత్మ సుఖంతోటి పోల్చుకొంటే ఇవి కోటో వంతు కూడా కాదు.


## రమణ భాస్కర చందాదారులకు విన్నపం

**రమణ భాస్కర శాశ్వత చందా (10 సం॥లకు) రు॥ 1200/-లు**. రమణ భాస్కర శాశ్వత చందాదారులుగా చేరి పత్రికను ప్రోత్సహించవలసినదిగా కోరుచున్నాము.

**సంవత్సర చందా రు॥ 150/-లు**. సంవత్సర చందాదారులకు చందా గడువు ముగిసినది. మీ చందాను స్వయంగా గానీ లేక

**శ్రీ రమణక్షేత్రం, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, యడ్ల బజార్, పాలకొల్లు బ్రాంచి** అకౌంట్ నెంబర్ **520101264185724** **(IFSC Code : UBIN0827533)** నందు గాని చెల్లించగలరు. చందాను **బ్యాంక్ అకౌంట్‌లో జమచేసినవారు** జమచేసిన తేదీ, వారి అడ్రసును **9866715896** ఫోన్ నెంబరుకు తెలియపరచగలరు.

# మార్గం ఏదైనా మిథ్యా నేను నశించాలి

**(శ్రీనాన్నగారి అనుగ్రహ భాషణముల నుంచి సేకరణ)**

మీకు ఎలా ఇష్టమైతే అలా సాధన చేసుకోండి. మీకు భక్తిమార్గం ఇష్టమైతే ఆ మార్గంలో వెళ్ళండి, జ్ఞానమార్గం ఇష్టమైతే అలా వెళ్ళండి. లేకపోతే ధ్యాన మార్గం ఇష్టమైతే ఏదో ఒక రూపాన్ని ధ్యానించుకొని ఒక నామాన్ని స్మరించుకొంటూ ఉండండి. మొత్తం మీద మీరు ఏ మార్గాన్ని అనుసరించినా ఈ మిథ్యానేను పోవాలి. మనలో పనికి రానిదల్లా మనలో ఉన్న కోపము, మనలో ఉన్న అహంకారము. ఈ మిథ్యానేనుకే ఇవి కావాలి.

భగవంతుడి మీద నమ్మకం పెంచుకొని, విశ్వాసం దృఢపరుచుకుంటే, మీ జీవితంలో ఏది తటస్థపడినా అది భగవంతుడి ప్రసాదంగా తీసుకుంటే, అది శరణాగతి మార్గం. అలా కాకుండా మీకు జీవితంలో సంఘటనలకి హెచ్చుతగ్గులు వస్తా ఉంటే, ఈ హెచ్చుతగ్గులు ఎవరికి వస్తున్నాయి, ఈ నేను ఎవరు, అని ప్రశ్నించుకోండి, అది విచారణా మార్గం. మొత్తం మీద ఈ సైతానుగాడు పోవాలి. లోపల ఎవడైతే మీకు నేనుగా వ్యక్తమవుతున్నాడో వాడే సైతాను. మీ జీవితంలో ఏ సంఘటన జరిగినా ఈశ్వర ప్రసాదంగా తీసుకున్నా వీడు పోతాడు, కాని ఒకవేళ మీకు పొంగు కుంగు వస్తావుంటే, ఈ పొంగుపోవటం క్రుంగిపోవటం ఎవరికి ఈ గొడవలు అన్నీ ఎవరికి అని ప్రశ్నించుకున్నా, ఈ దొంగ నేను పత్తా లేకుండా పోతాడు. అలాగైనా పోతాడు, ఇలాగైనా పోతాడు. అంచేత మీ ఇష్టం అనేవారు భగవాన్.

భగవానుకి ఎవరినీ బలవంత పెట్టే అలవాటు లేదు. అసలు ఆయన స్వభావంలో లేదు అది. విషయం చెప్పి, మీకు ఇష్టమైతే తీసుకోండి లేకపోతే లేదు అని చెపుతారు. అడ్వర్‌టైజ్‌మెంట్ కింద పబ్లిసిటీ కింద ఏమీ ఉండదు. జనాన్ని పోగుచేసుకునే మనస్తత్వం అసలు ఉండదు, మీకు విషయం చెపుతారు, నీ స్వభావానికి అనుకూలంగా ఉంటే, ఈ మార్గం నీకు నచ్చితే నువ్వు చేసుకో లేకపోతే విడిచిపెట్టేయి అంటారు. అసలే మీరు కష్టాలు పడుతుంటే, మీ కష్టాలను పెంచే స్వభావం కాదు ఆయనది. అంచేత ఆయన చెప్పే పద్ధతి ఆయన చెపుతారు, బలవంతం చేయరు. మీ మార్గాన్ని అనుసరించి, మీకు ఏది ఇష్టమైతే అందులో ప్రయాణం చెయ్యండి. అయితే మీరు ఏ మార్గాన్ని అనుసరించినా, అందులో లీనమై చెయ్యాలి, ఇష్టంగా చెయ్యాలి. ప్రేమగా చెయ్యాలి, స్ఫూర్తితోటి చెయ్యాలి. అంకిత భావంతోటి చెయ్యాలి!

**శ్రీ రమణ క్షేత్రం, జిన్నూరు - సెల్ : 98485 23805**

SRI RAMANA KSHETRAM A/c. No. **6794857762**
**INDIAN BANK, VEDANGIPALEM BRANCH**
IFSC Code : **IDIB000V142, Contact No. 9866715896**

# ఉగాది

నూతన తెలుగు సంవత్సరం శోభకృత్‌లోకి ది॥ 22-03-2023న ప్రవేశించ నున్నాం. ఆ పర్వదినాన్నే 'ఉగాది' అని పిలవడం మన సంప్రదాయం. 'కాలం' పరమాత్మ స్వరూపం. ఒక్కసారి ఆగి, కాలగమనాన్ని గుర్తుచేసుకోవలసిన రోజు. సృష్టిలో వెలకట్టలేని వస్తువు కాలము. అట్టి కాల రూపంలో మానవ జీవితం ఉంది కాబట్టి, కాలాన్ని వృధా చేయకుండా మన ఆధ్యాత్మిక సాధనల లక్ష్యాన్ని చేరుకోవడానికి ఉపయోగించాలి. ఉగాది రోజున మనము స్వీకరించే ఉగాది పచ్చడిలోని విభిన్నరుచులు మనిషి మనుగడలోని ఆటుపోట్లకు ప్రతీకలు. ఒక్క క్షణకాలము కూడా నేను ఎవరు? అన్న విచారణ లేకుండా గడపకూడదు. మనిషి వర్తమానంలో జీవించాలి. నిన్న స్మృతి రూపం, రేపు ఊహారూపం, వర్తమానం నిజం. కానీ మనము ఎప్పుడు గతకాలములో జరిగిన విషయాల గురించో లేదా భవిష్యత్తులో జరుగబోయే వాటి గురించో ఆలోచిస్తుంది, కానీ వర్తమానంలో నిలబడదు. కాలం తన పని తాను చేస్తూ సాక్షీభూతంగా సాగుతుంది. ఉచ్ఛ్వాస, నిశ్వాసలు ఎంత సహజమో, కాలము తీసుకొచ్చే మార్పు అంతే సహజం. శరీరము క్షణభంగురము. కాలానికి లోబడి ఉన్న దేహేంద్రియ మనోబుద్ధులను ఉపయోగించుకొని, కాలాతీత 'స్వరూప స్థితి'లోకి మేల్కోవాలి. దానికి గుర్వనుగ్రహం అత్యంత కీలకం. కాలాన్ని తాను ఎవరో? తన నిజ స్వరూపం ఏమిటో తెలుసుకునేందుకు వినియోగించాలి. అంతకుమించి మహత్కార్యం లేదు. శమాది షట్క సంపత్తియే ఆధ్యాత్మిక జీవితానికి పునాది. మన తలంపు, మాట, చేత అనగా త్రికరణాలు పరమాత్మ కేంద్రముగా ఉండాలి, అప్పుడు వ్యక్తిభావన నశిస్తుంది. ఎవరైతే నిష్కామంగా పనిచేస్తూ, ఫలితాన్ని ఆశించరో ఆ హృదయంలో ఈశ్వరుడు ఆవిష్కరింపబడతాడు. ఎవరి పొరపాట్లను, దోషాలను వారు గుర్తిస్తూ వాటిని నిర్మూలించుకునే ప్రయత్నం చేస్తుంటే, వారు పక్వానికి వచ్చినట్లు లెక్క. అట్టివారికి లోచూపు కలుగుతుంది. లోచూపు కలగడం వల్ల మనసు అంతర్ముఖమవుతుంది, అంతర్ముఖమైన మనస్సుకు ఆత్మజ్ఞానం కలుగుతుంది. కృషిలేనిదే, కృప ఉండదు. దేహాభిమానాన్ని తగ్గించుకోవడమే నిజమైన సాధన. గురుసన్నిధే ప్రశాంతి నిలయం. తృప్తినిమించిన సంపదలేదు. కోరికలు నెమ్మదించి, జీవిత పరమార్థమెరిగి, నిత్యతృప్తుడైనవాడే 'శాంతి'ని అందుకోగలడు. మన స్వరూపమే శాంతి.

**- చావలి సూర్యనారాయణమూర్తి, అమలాపురం, సెల్ : 9963195064**

# ఆదర్శ శ్రీమతికి అక్షర బహుమతి

**(గత సంచిక తరువాయి)**

స్వామీ... మీ సేవకురాలిని అన్నది. దానిపై పండితులవారు "నా సేవకురాలివా? నా సేవలో నిన్ను వినియోగించనవారెవరో?" అన్నారు. అప్పుడు వారి ధర్మపత్ని "మహానుభావా! ధర్మదేవత తప్ప పత్నిని పతిసేవలో ఇతరులెవరు వినియోగిస్తారు?" అన్నది. పండితులవారు "ఏమి నీవు నా భార్యవా? నిన్నెప్పుడూ చూడలేదే?" అన్నాడాయన. ఆ మహామనిషి మనస్సు ఇంకా పూర్తిగా ఇహంలోకి రాలేదు. "మనకు వివాహం జరిగిందా? ఎప్పుడు నాకేమీ గుర్తు రావటం లేదే. నీ నామధేయం?" అని ప్రశ్నించాడు. "ప్రాణేశ్వరా నా పేరు 'భామతి'. పరిణయమై అర్ధశతాబ్ధి కాలమైనది. ఇంతవరకూ మీరు అంతర్ముఖులుగానే ఉన్నారు. మీ వృత్తి మనస్సు ఇప్పడే బహిర్గతమైనది. మనస్సు యోగం లేనిదే జ్ఞానేంద్రియాలు బాహ్య విషయాలను గ్రహించలేవు కదా. 'నచేంద్రియాణి పశ్యంతి మన ఏవాత్ర పశ్యతి' స్వామీ క్షమించండి. నేడు నా అజాగ్రత్త వల్ల దీపం ఆరిపోగా మీకు విక్షేపం కలిగింది" అన్నది ఆ ప్రౌఢ వయస్కురాలు. అది విని పండితులవారి హృదయం కరిగిపోయింది. వాక్కు గద్గదమైనది. " 'భామతీ' నీ సహజ పవిత్ర తపోమయ జీవనం, నీ త్యాగంతో పోలిస్తే నా శాస్త్రాధ్యయనం, నా వివేకం, నా వేదాంతం ఎందుకూ కొరగానివి. వ్యాసదేవుడు గ్రంథకర్త. నేను భాష్యకర్తను కాని నీవు రూపుదాల్చిన వేదాంతానివి, నీ త్యాగం అపూర్వం. నీ పతిభక్తి అమోఘం, నీ పేరు లోకంలో చిరకాలం నిలిచేటట్లు చేస్తా" అంటూ వాచస్పతి మిశ్రులు తాను రచించిన ప్రౌఢమైన సూత్రభాష్యానికి 'భామతీవ్యాఖ్య' అని నామకరణం చేసారు. వేదాంత దర్శనానికి అపూర్వ భాష్య గ్రంథం 'భామతి' నేటికీ ధర్మజీవునులైన విప్ర దంపతుల ఉజ్వల కీర్తి పతాకంగా ప్రకాశిస్తోంది.

ఈ వ్యాస సంకల్పానికి దోహదపడిన శ్రీమాన్ తంగిరాల రాజేంద్రప్రసాద్ శర్మ గారి ప్రేరణ అని పాఠకులకు వినయపూర్వకంగా మనవి చేసుకొంటున్నాను.

**(సశేషం)**

**- సాగిరాజు రామకృష్ణంరాజు, అర్ధవరం, సెల్ : 9491968966**